# వాడే వీడు

శ్రీ. శ్రీ.

వీడు అంటే యిల్లు. వాడుక లేకపోతే వీడు పాడవుతుంది. వాడుతున్నంతసేపు వీడు బతికి ఉంటుంది. బతికున్న ప్రతీవాడి శరీరం వాడే వీడు.

వాడడం పువ్వుకి వర్తింపజేసే అర్థంలో వాడే వీడు ఎప్పుడో ఒకప్పుడు పూర్తిగా వాడిపోయే పువ్వు. వాడే వీడు అంటే ఎప్పుడో ఒకప్పుడు చచ్చిపోయి రాలిపోవలసిన శరీరం అన్నమాట.

“వాడేవీడు” అంటే లేనిపోని అర్థాలను వెదకడం మాని ఎక్కడో ఎప్పుడో ఉన్నవాడే, ఇప్పుడు ఇక్కడ ఉన్నవీడు అని ఎదురుగుండా కనబడుతున్న అర్థాన్ని స్వీకరిద్దాం. వాడే వీడు అంటే “సోఽహం” అని అర్థం.

వీడు “అహం” ఎలాగయిందని ప్రశ్న రావచ్చును. మావూళ్లో ఒక బైరాగి ఉండేవాడు. వాడు తనగురించి ఎప్పుడూ మాట్లాడేవాడు కాడు. ఎప్పుడైనా అరటిపళ్లో సిగరెట్టో కావలసివస్తే “వీడికి అరటిపళ్లుకావాలి, వీడిచేత సిగరెట్టు కాల్పించండి” అనేవాడు.

మొపాసాం రాసిన కథల్లో “వాడు” అని ఒక అద్భుతమైన, భయంకరమైన కథ ఉంది- అందు గాని “వాడు” మరెవరోకాడు. “నేను” ని ఎప్పుడూ వదలని నీడ. ఒంటరితనాన్ని ఆశ్రయించుకొనే ఇంకొకతనం. “నేనే” ను శాశ్వతంగా ఆక్రమించే “నానా.”

1920 లో ఫ్రాంజ్ కాఫ్కా “వాడు” అనే శీర్షికకింద కొన్ని మ్యూజింగ్స్ రాశాడు. అవి కాఫ్కా ఆత్మయొక్క ఎక్స్-రే ఫోటోగ్రాఫు అని చెప్పాలి. “కళ యావత్తూ ఉత్తమ పురుషైక వచనం” అన్న జీద్ మాటకి కాఫ్కారచన మంచి ఉదాహరణ. ఇక్కడ కళ అనడానికి బదులు జీవితం అనడం మరీ మంచిది.

అంచేతే హామ్లెట్ ఎవరో కాదు షేక్స్పియరే! **To be or not to be** అన్నది హామ్లెట్ సమస్య కాదు షేక్స్పియర్ సమస్య. గురజాడకవి సమస్య. చావుబ్రదుకులనుగురించిఆలోచించేప్రతివాడిసమస్య.

మీటర్లింక్ అన్నాడు: “నేడు సోక్రటీస్ తన యింటికి వెళ్ళితే అక్కడ గుమ్మంలో కూర్చున్న సోక్రటీసునే చూస్తాడు. జూడాస్ ఈరాత్రి బయల్దేరితే జూడాస్‌ను కలుసుకుందామనే అతని కాళ్లు కదులుతాయి!” అని.

ఇది ఉటంకిస్తూ యూలిసిస్‌లో జేమ్స్ జాయిస్ Every life is many days, day after day. We walk through ourselves, meeting robbers, ghosts, giants, old men, young men, wives, widows, brothers-in-love. But always meeting ourselves. అని కలిపేను.

వేగుజుక్కా గ్రంథమాల వాళ్లు ప్రకటించిన ‘వాడేవీడు’ ప్రతులిప్పుడు దొరుకుతాయో లేదో తెలియదుగాని నా యాత్రలో యిప్పుడా గ్రంథాన్ని మళ్లీ చదివితే దానిద్వారా అనేక రహస్యాపరాధాలను పరిశోధించ గలనని నిస్సంకోచంగా చెప్పుతున్నాను. జీవితం ఒక డిటెక్టివ్ నవల. దాని శీర్షిక ‘వాడే వీడు’. దాని మాతృక వంగభాషలో ఉంది. దాన్ని స్వతంత్రంగా రాసిన పాంచకడీ దేవుడికి మనం కృతజ్ఞత కనబరచాలి. బెంగాలీ భాషనుంచి రకరకాల సంస్కారం దిగుమతి చేసుకుంటున్న రోజులలో రవీంద్రనాథుడికి మనం ఇవ్వవలసినదానికంటె ఎక్కువ ప్రశంస ఇచ్చాం. పాంచకడీ దేవుణ్ని మనం మరిచిపోవడం ఏమీ బాగులేదు. రవీంద్రుడికంటె పాంచకడీదేవు గొప్పవాడని నేను నిజంగా నమ్ముతున్నాను. చాలామందికిది కోపం తెప్పించవచ్చును. కోపం తెప్పించడానికే, మళ్లా వాళ్లచేత ఆలోచించేటట్టు చెయ్యడానికే ఇది రాస్తున్నాను

నిస్సందేహంగా “గీతాంజలి” కంటె “వాడే వీడు” గొప్ప గ్రంథం. ప్రపంచం దృష్టిలో గీతాంజలి రచయిత బహుమానాలకి అర్హుడు. పాంచకడీ దేవుడు బడాచోరుడు. (ఏ పాశ్చాత్య- చెత్తనో ఇమిటేట్ చేసినవాడు) ఒకమారు చదివి పారేసే పుస్తకం “వాడే వీడు”. పదేపదే పారాయణ చెయ్యవలసిన గ్రంథం “గీతాంజలి”. ఇదీ ప్రపంచాభిప్రాయం.

దీనితో నేను ఏకీభవించలేక పోతున్నాను.

“గీతాంజలి”కవిత్వం వేషం వేసుకొచ్చి వచనం కాని వచనభావాలను మాత్రమే నాలో ప్రసరిస్తుంది. “వాడేవీడు” ఏమోసాన్నీ ప్రకటించకుండా “నేను ఉత్తవచనాన్ని, చెత్త డిటెక్టివు నవలని” అని చెప్పకొని నాచుట్టూ ఉన్న ప్రపంచాన్ని, పాపాన్ని జ్ఞాపకంచేసి “మదశ్రుకణాళి హేతు” వవుతుంది.

జీవితం వాడేవీడు. గీతాంజలి కానేకాదు.